సాక్షి

నిజామాబాద్

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



కబళించిన వాహనాలు

ఉమ్మడి జిల్లాలో ఇద్దరు బాలురను వాహనాలు కబళించాయి. దీంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

- 2లో ▸



స్వదేశీ ఉత్పత్తులను..

ప్రజలు స్వదేశీ ఉత్పత్తులను ఆదరించి విని యోగించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు.

- 2లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.8 /21.7

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

12 నుంచి కాజీపేట్ - దాదర్ రైలు

సుభాష్‌నగర్: కాజీపేట్ – దాదర్ (07195/96) రైలు ఎట్టకేలకు మళ్లీ పట్టాలెక్కనుంది. అయోధ్య రాముడి దర్శనం కోసం ప్రత్యేక రైళ్లు నడిపిన నేపథ్యంలో 9 నెలల క్రితం ఈ రైలును రద్దు చేశారు. ఈ నెల 12 నుంచి ఈ ట్రెయిన్‌ను నడపనున్నట్లు రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నిజామాబాద్ పార్లమెంట్ లోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్ ప్రాంతాల నుంచి ముంబయి వెళ్లనున్న ప్రయాణికుల బాధలు తప్పనున్నాయి. 9 నెలల క్రితం రద్దు చేసిన ఈ రైలును నడపాలన్న డిమాండ్ కొంతకాలంగా విన్పిస్తోంది. ఆ మేరకు రైలు పునరుద్ధరించాలని ఎంపీ అర్వింద్ రైల్వేమంత్రిని అశ్వినీ వైష్ణవ్, ఆ శాఖ ఉన్నతాధికారులను పలుమార్లు కోరిన సంగతి తెలిసిందే. 15రోజుల ఎంపీ రైల్వే మంత్రిని కలిసి రైలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించారు. అందుకనుగుణంగా రైల్వే ఉన్నతాధికారులు కాజీపేట్ – దాదర్ రైలును నవంబర్ 28వ తేదీ వర కూ పొడిగించారు. విషయం తెలుసుకున్న ఎంపీ రైలును రెగ్యులర్ ట్రెన్‌గా నడిపించాల్సిందేనని పట్టుబట్టారు. ఎంపీ అర్వింద్ కోరిక మేరకు ఈ రైలు జనవరి 30 వరకు పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు తాజాగా ఉత్తర్వులు ఇచ్చారు.

రేపు ఆర్‌ఎస్‌ఎస్ విజయదశమి ఉత్సవం

సుభాష్‌నగర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూరు నగర విజయదశమి ఉత్సవం 10న ఉదయం 7.30 గంటలకు హరిచరణ్ మార్వాడి విద్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యవాహ అర్గుల సత్యం తెలిపారు. ప్రధాన వక్తగా హిందూ జాగరణ మంచ్ అఖిల భారతీయ సహ సంఘటన కార్యదర్శి పెడబల్లె దేవేంద్ర రెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గెవార్ చూపిన మార్గంలో హిందువులందరూ సంఘటిత శక్తిగా కలిసి నడవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

పండుగకు ఊరెళ్తే సమాచారం ఇవ్వాలి: సీపీ

ఖలీల్‌వాడి: దసరా పండుగకు స్వగ్రామాలకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో సూచించారు. ఇరుగు పొరుగు వారిని ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పాలన్నారు. వీలైనంత త్వరగా ప్రయాణం ముగించుకొని వచ్చేలా ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. ఇంట్లో ఒంటరిగా ఎవరైనా ఉంటే అపరిచితులు వస్తే నమ్మొద్దన్నారు. ఊరు వెళ్లేటప్పుడు ఖరీదైన వస్తువులు బ్యాంక్ లాకర్లో పెట్టుకోవాలని సూచించారు. తాళం వేసి ఊరు వెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు.

నిబంధనలు అమలు చేస్తున్నాం

నిజామాబాద్‌అర్బన్: కళాశాలలో అనుమతులు, అటానమస్, న్యాక్ గుర్తింపు పరిశీలనలో నిబంధనలు అమలు చేస్తుందని తెయూ అకాడమిక్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. నిషిత కళాశాల అటానమస్ హోదాకు సంబంధించిన పరిశీలన తమ హయాంలో జరగలేదన్నారు. కళాశాలను పరిశీలించి నోటీసులు జారీ చేసిన ఘటనలు కూడా గతంలో జరిగినట్లు తెలిపారు. కళాశాలలకు ఉన్నత హోదా రావాలంటే పరిశీలన చేసి నివేదిక పంపించడం మాత్రమే తమ బాధ్యతన్నారు.

అనుమతులు.. అనుమానాలు!

అధికారుల అనుమతులు ఉన్నాయనే భరోసాతో ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్‌లలోని ఫ్లాట్‌లు కొనుగోలు చేసిన మధ్య తరగతి ప్రజలు ఇప్పుడు టెన్షన్ పడుతున్నారు. తాము కొన్నవి బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్, ప్రభుత్వ భూములు, పార్కుల్లో ఉన్నాయా ? అనే అనుమానాలను నివృత్తి చేసుకుంటున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని నిర్మించిన కట్టడాల వివరాలను కలెక్టర్ తెప్పించుకుంటున్నట్లు సమాచారం.



ఫైరింజన్ సైతం సక్రమంగా తిరిగే వీలు లేని బైపాస్‌లోని ఓ అపార్ట్‌మెంట్

- ఆక్రమణలకూ అధికారుల సంతకాలు !
- జిల్లాలోని అన్ని వివరాలు తెప్పించుకుంటున్న కలెక్టర్
- ఇప్పటికే ప్లాట్లు, ఫ్లాట్‌లు కొనుగోలు చేసిన వారిలో టెన్షన్
- లోతుగా పరిశీలిస్తున్న కొనుగోలుదారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాజధానిలో హైడ్రా కార్యాచరణ నేపథ్యంలో విపరీతమైన చర్చ జరుగుతుండగా.. జిల్లాలోనూ ఇలాంటి అథారిటీని ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఇప్పటికే ప్రకటించారు. ఇదిలా ఉండగా గతంలోనే అన్ని జిల్లాల్లో హైడ్రా లాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్లకు మౌఖికంగా ఆదేశాలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఈ విషయమై ఇప్పటికే కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాతో పాటు జిల్లా కేంద్రంలోని చెరువులు, వాగులు, కాలువలు, పార్కులు, ప్రభుత్వ భూములు, బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్‌లో భూములు ఆక్రమించుకుని నిర్మించిన కట్టడాల వివరాలు తెప్పించుకుంటున్నట్లు సమాచారం. అదేవిధంగా నగరంలో చాలా చోట్ల భూ ఆక్రమణల నేపథ్యంలో తలెత్తుతున్న తగాదాలతో శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమవుతోంది. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగనవార్ సైతం ఆయా ఆక్రమణల వివరాలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

భరోసాతో కొన్నారు

మధ్య తరగతి ప్రజలు, సాధారణ ఉద్యోగులు కూడబెట్టుకున్న తమ కష్టార్జితాన్ని వెచ్చించి కొనుగోలు చేస్తున్న ప్లాట్లు, అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్‌లకు సంబంధించి అధికారులు ఇచ్చిన అనుమతులను చూస్తారు. అధికారులు పూరి స్థాయి అనుమతులు ఇచ్చినందున భవిష్యత్తులో తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండవనే భరోసాతో నగరంలోని చాలాచోట్ల మధ్యతరగతి, చిరుద్యోగులు వాటిని కొనుక్కున్నారు. సదరు స్థలాలు, అపార్ట్‌మెంట్లు బఫర్ జోన్‌లో ఉన్నాయా, ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయా, ప్రభుత్వ భూములు, పార్కుల్లో ఉన్నాయా అనే విషయమై అనుమానాలు ఉన్నప్పటికీ అధికారులు అన్ని ధ్రువీకరణలు ఇవ్వడంతో బేఫికర్ అనుకుని కొనుగోలు చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితులు, పరిణామాల నేపథ్యంలో నగరంలోని బైపాస్, పులాంగ్ వాగు పొడవునా దాని పరీవాహకంలో, చెరువుల శిఖం భూముల్లో, రైల్వే జోన్లలో వేసిన వెంచర్లు, అపార్ట్‌మెంట్లలో తాము కొనుగోలు చేసిన భూముల విషయమై టెన్షన్ పడుతున్నారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు ఇచ్చిన అనుమతులు చూస్తే ఎవరికైనా ఈ అనుమానాలు రావడం సహజం. ఇదిలా ఉండగా భవిష్యత్తు అవసరాల నిమిత్తం పెట్టుబడి తరహాలో భూములు, ఫ్లాట్‌లు కొనుగోలు చేయాలనుకుంటున్న వారు సైతం అధికారులు ఇచ్చిన అనుమతుల విషయమై లోతుగా పరిశీలిస్తున్నారు. అనుమతులు ఉన్నప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఆయా ప్రాంతాలు ఏఏ జోన్ల పరిధిలోకి వస్తాయో అనే విషయాలను పక్కాగా చూసుకుంటున్నారు. ఈ క్రమంలో భూముల అమ్మకాలు, కొనుగోళ్లు పడిపోయాయి. రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయి.

> రైల్వే లైన్‌కు వంద మీటర్ల దూరం వరకు లే అవుట్లు వేయకూడదు. నగరంలోని పులాంగ్ ఆక్రమణలపై పరిశీలన చేస్తున్నాం. : కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఇష్టారీతిన నిర్మాణాలు

నిజామాబాద్ నగరంలో బిల్డర్లు నిర్మించిన చాలా అపార్ట్‌మెంట్లలో అత్యవసర సమయాల్లో ఫైరింజన్ సాఫీగా తిరగలేని పరిస్థితి ఉంది. ఇలా ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు చేసినప్పటికీ అధికారులు అనుమతులు ఇవ్వడం విశేషం. పైగా వక్రమార్గాలను మున్సిపల్ అధికారులే ఆయా బిల్డర్లకు సూచించి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టిన విషయం బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో రియల్టర్ల వెంచర్లు, నిర్మాణాలకు సంబంధించి, వాటికి అధికారులు ఇచ్చిన అనుమతులలో సర్వత్రా అనుమానాలు నెలకొనడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ విషయాలపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును 'సాక్షి' వివరణ కోరగా రైల్వే లైన్‌కు వంద మీటర్ల దూరంలో ఎలాంటి లేఅవుట్లు చేయకూడదన్నారు. అదేవిధంగా పులాంగ్ వాగు ఆక్రమణలు, చెరువుల కబ్జాల విషయమై పరిశీలన చేస్తున్నామన్నారు. పరిశీలన, సర్వే పూర్తయ్యాక ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ చేస్తామన్నారు.

రూ. 1.50 కోట్లతో అమ్మవారికి అలంకరణ



నందిపేటలో నగదుతో అలంకరించిన మహాలక్ష్మి అమ్మవారు

నందిపేట్(ఆర్మూర్): నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నందిపేట మండల కేంద్రంలోని సుభాష్ నగర్ శ్రీ శక్తి రూపిణి దుర్గాదేవి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మహాలక్ష్మి అవతారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి రూ. 1.50 కోట్ల పై చిలుకు నగదుతో అలకరించారు. రూ. 500, 200, 100, 50, 20, 10 కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఘనంగా పూజలు చేశారు. వందలాది మంది మహిళలు కుంకుమార్చన చేసి దుర్గాపూజను జరుపుకున్నారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మంగళవారం చిన్నారులు నృత్యాలతో అలరించారు. అందెల రవళి నాట్యాలయం ఆధ్వర్యంలో నాట్యోపాసన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు తమ అభినయంతో ఆకట్టుకున్నారు.

వివరాలు 4లో..

పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు పీపీ వావా

- సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు పీపీ వావా

నిజామాబాద్ అర్బన్: పారిశుధ్య కార్మికుల భద్రతా, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు పీపీ వావా సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. జిల్లాలో ఎక్కడ కూడా మ్యానువల్ స్కావెంజర్స్ లేరని, 1993 నిషేధ చట్టం పకడ్బందీగా అమలవుతోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సఫాయి కర్మచారీలకు సంబంధించి జిల్లాలో 15 ఏళ్లుగా ఎలాంటి అట్రాసిటీ కేసులు నమోదు కాలేదని సీపీ కల్మేశ్వర్ పేర్కొన్నారు. 2010లో చివరి అట్రాసిటీ కేసు నమోదు అయ్యిందని, ఇద్దరు బాధితులకు పరిహారం సైతం ఇప్పించినట్లు వివరించారు. పీపీ వావా మాట్లాడుతూ మాన్యువల్ స్కావెంజర్ నిషేధ చట్టం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. క్రమం తప్పకుండా వారికి ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి, వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అంతకుముందు నగర పాలక సంస్థలో పారిశుధ్య కార్మికులకు అమలు చేస్తున్న కార్యక్రమాలను, సేఫ్టీ కిట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, కేంద్ర సామాజిక న్యాయ విభాగం సభ్యుడు గిరేందర్ నాథ్, కో-ఆర్డినేటర్ చరణ్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- రైతులు ఇబ్బందులు పడొద్దు
- సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: ధాన్యం సేకరణలో అధికారులు నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హెచ్చరించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సాఫీగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగేలా ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కలెక్టరేట్‌లో మంగళవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి ఆయా శాఖల అధికారులు, సొసైటీల సీఈవోలు, రైస్ మిల్లర్లు, ఐకేపీ సీసీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది తప్పిదాలతో రైతులు ఇబ్బందులు పడినా, బిల్లుల చెల్లింపులలో జాప్యం చేసినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో 12 వేల వరకు టార్పాలిన్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని, వారం రోజుల్లో మరిన్ని టార్పాలిన్లు రాన్నాయని పేర్కొన్నారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కోసం వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈసారి అదనంగా 150 ధాన్యం సేకరణ కేంద్రాలు కొత్తగా అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. సరిపడా హమాలీలను ఏర్పాటు చేసుకుని, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలన్నారు.

'ప్రైవేట్' ధాన్యం రాకుండా చూడాలి

సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించనున్నందున కొనుగోలు కేంద్రాలకు ప్రైవేట్ మార్కెట్‌కు చెందిన వ్యక్తుల నుంచి ధాన్యం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సన్న రకం ధాన్యంలో దొడ్డు రకం కలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను సాకుగా చూపి రైతులను నష్టపర్చే ప్రయత్నాలు చేస్తే ఊరుకోమన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్, సివిల్ సప్లైస్ డీఎం రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

మత్స్యకారులు అభివృద్ధి చెందాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి: మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం సబ్సిడీపై చేప పిల్లలను అందజేస్తోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జానకంపేట్ అశోక్‌సాగర్‌లో మంగళవారం ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి చేపపిల్లలు వదిలారు. చెరువులో మొత్తం 57,300 చేప పిల్లలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 2.27 కోట్ల చేప పిల్లలు వదులుతామని పేర్కొన్నారు. చేప పిల్లలను వదిలే ముందు మత్స్యకారులు తప్పనిసరిగా వాటి నాణ్యతను పరిశీలించాలని సూచించారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న అశోక్ సాగర్ చెరువు చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వివిధ చెరువుల్లో చేపల పెంపకానికి అవరోధంగా మారిన గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ట్రెయినీ కలెక్టర్ సంకెత్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధికారి ఆంజనేయ స్వామి పాల్గొన్నారు.



చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

డీఎస్సీకి 464 మంది ఎంపిక

- జాబితా విడుదల చేసిన డీఈవో దుర్గాప్రసాద్
- నేడు నియామక పత్రాలు అందించనున్న సీఎం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ మంగళవారం సా యంత్రం విడుదల చేశారు. మొత్తం 601 పోస్టులకు 464 మందిని ఎంపిక చేశారు. మిగతా 137 మందికి వివిధ కారణాలు వాయిదా వేసినట్లు తెలిసింది. 464 మందిలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 120 మంది, ఎస్జీటీ విభాగంలో 344 మంది ఉన్నారు. ఎంపికైన వారికి బుధవారం హైదరాబాద్‌లో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందించనున్నారు. అభ్యర్థులు 11 బస్సులలో హైదరాబాద్ వెళ్లనున్నారు.

జిల్లాలో డీఎస్సీ ద్వారా వివిధ సబ్జెక్టుల్లో భర్తీ చేసిన పోస్టులు

సబ్జెక్టు	మీడియం	ప్రభుత్వ	లోకల్‌బాడీ	మొత్తం
ఎస్‌ఏ(బయోసైన్స్)	తెలుగు	3	15	18
ఎస్‌ఏ(బయోసైన్స్)	ఉర్దూ	–	1	1
ఎస్‌ఏ(ఇంగ్లీష్)	--	1	6	7
ఎస్‌ఏ(హిందీ)	--	2	7	9
ఎస్‌ఏ(గణితం)	తెలుగు	2	14	16
ఎస్‌ఏ(గణితం)	ఉర్దూ	1	–	1
ఎస్‌ఏ(పీఈటీ)	తెలుగు	1	2	3
ఎస్‌ఏ(ఫిజికల్‌సైన్స్)	తెలుగు	1	4	5
ఎస్‌ఏ(సోషల్)	తెలుగు	3	33	36
ఎస్‌ఏ(సోషల్)	ఉర్దూ	1	2	3
ఎస్‌ఏ(తెలుగు)	--	2	8	10
ఎస్‌ఏ(ఉర్దూ)	--	1	1	2
ఎస్‌ఏ(స్పెషల్ ఎడ్యుకేషన్)	తెలుగు	1	8	9
ఎస్‌ఏ(స్పెషల్ ఎడ్యుకేషన్)	ఉర్దూ	–	–	–
ఎస్జీటీ	ఇంగ్లిష్	3	–	3
ఎస్జీటీ	హిందీ	1	–	1
ఎస్జీటీ	తెలుగు	44	233	277
ఎస్జీటీ	ఉర్దూ	19	19	38
ఎల్‌పీ(హిందీ)	--	--	4	4
ఎల్‌పీ(తెలుగు)	--	3	7	10
ఎల్‌పీ(ఉర్దూ)	--	2	1	3
పీఈటీ	ఇంగ్లిష్	1	–	1
పీఈటీ	తెలుగు	--	5	5
పీఈటీ	ఉర్దూ	1	1	2
మొత్తం		93	371	464

ధర తగ్గిస్తున్న దళారులు

- వర్షాలు పడుతుండటంతో మక్క, సోయా రైతుల్లో ఆందోళన
- ఇదే అదనుగా క్వింటాల్‌కు రూ.150 వరకు తగ్గించిన వ్యాపారులు

బాల్కొండ: ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులకు నష్టాలే మిగులున్నాయి. దళారులు మక్క, సోయా ధరలు తగ్గిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్ ప్రారంభంలో మక్కలకు మంచి ధర పలికింది. క్వింటాల్‌కు రూ.2,700 వరకు చెల్లించారు. కానీ మార్కెట్‌లోకి మక్కలు అధికంగా రావడంతో రూ.2450 చెల్లించారు. ప్రస్తుతం వాతావరణం మేఘావృతమై ఉండటంతో ఇదే అదునుగా చేసుకొని వ్యాపారులు ధరను తగ్గిస్తున్నారు. మక్క ధర వారం రోజుల్లే రూ.150 తగ్గించారు. రైతులు కూడా వర్షాల బెడదను తట్టుకోలేక ఎంతో కొంతకు అమ్ముకుంటున్నారు. సోయా ధర సైతం పడిపోయింది. ఈ ఏడాది సోయా పంట తక్కువ విస్తీర్ణంలోనే సాగు చేశారు. అయినా పంటకు ధర లేకుండా పోయింది. వారం క్రితం వరకు సోయా క్వింటాల్‌కు రూ.4400 చెల్లించిన వ్యాపారులు ప్రస్తుతం రూ.4300 ఇస్తున్నారు. మార్కెట్‌లో సోయాలు లేకున్న ధర నిలకడగా లేకపోవడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దూదిగాంలో రోడ్డుపై ఆరబోసిన మక్కలు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



వ్యాపారులు సిండికేట్‌గా మారి మక్క, సోయా పంటల ధరను తగ్గిస్తున్నారు. వర్షాలు కురుస్తాయనే భయంతో వాళ్లు చెప్పిన ధరకే అమ్ముకుంటున్నాం. ధరలను తగ్గించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– నద్కుడ రమేష్, రైతు, వెంచిర్యాల్

క్లుప్తంగా

ఎస్సారెస్పీ నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో మంగళవారం నాలుగు వరదగేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. 34,086 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 12,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాలువ ద్వారా 12 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 6800, లక్ష్మి కాలువ ద్వారా 150, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగుల కాగా మంగళవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

శ్రీవారిని దర్శించుకున్న పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



నిజామాబాద్ సిటీ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం నైవేద్య విరామసమయంలో దర్శనానికి వెళ్లిన వారికి వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

చిన్నారులను కబళించిన వాహనాలు

- కామారెడ్డి జిల్లాలో ట్రాక్టర్ కిందపడి ఐదేళ్ల బాలుడు..
- నిజామాబాద్ జిల్లాలో టాటా ఏస్ ఢీకొని ఏడేళ్ల బాలుడి మృతి

అభంశుభం తెలియని చిన్నారుల ప్రాణాలను వాహనాలు కబళించాయి. ట్రాక్టర్ ట్రాలీ మీదపడి కామారెడ్డి జిల్లాలో ఐదేళ్ల బాలుడు మృతి చెందగా, టాటా ఏస్ వాహనం ఢీకొని నిజామాబాద్ జిల్లాలో ఏడేళ్ల బాలుడు కన్నుమూశాడు. రెండు కుటుంబాల్లో విషాదం నింపిన ఆయా ఘటనలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..



ఘటనాస్థలంలో ట్రాక్టర్



రిషికేశ్ మృతదేహం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బోనాల్ చెరువు ముందు తండాలో ట్రాక్టర్ కిందపడి రిషికేశ్(5) అనే బాలుడు మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోనాల్ చెరువు ముందు తండాకు చెందిన రమావత్ భాస్కర్ తన ట్రాక్టర్‌ను రోజూలాగే పార్క్ చేసి ఉంచాడు. ఆ స్థలంలో దిగుడు ఉండడంతో గేర్ వేసి ట్రాక్టర్‌ను నిలిపి ఉంచాడు. దురదృష్టవశాత్తు ఆయన కుమారుడు రిషికేశ్ ఆడుకుంటూ ట్రాక్టర్‌పైకి ఎక్కి గేర్ తీయడంతో ముందుకు వెళ్లిన ట్రాక్టర్ గుంతలోపడిపోయింది. ట్రాక్టర్‌పై ఉన్న రిషికేశ్ ఎగిరి కింద పడిపోగా, అతడిపై ట్రాలీ పడడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు మృతి చెందడంతో భాస్కర్‌తోపాటు ఆయన భార్య నిర్మల తల్లడిల్లిపోయారు. వారి రోదన తండావాసులను కంటతడి పెట్టించింది.

భీమ్‌గల్‌లో..

బాల్కొండ: రోడ్డు దాటుతున్న బాలుడిని అతివేగంగా దూసుకొచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. భీమ్‌గల్ పట్టణంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో బాలుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని నందిగల్లీకి చెందిన తోపార్ నిశ్వంత్(7) రోడ్డు దాటుతుండగా భీమ్‌గల్ నుంచి సిరికొండ వైపు వెళ్తున్న టాటా ఏస్ వేగంగా దూసుకొచ్చి ఢీకొట్టింది. నిశ్వంత్ తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆర్మూర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. బాలుడి తల్లి వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నిశ్వంత్ మృతదేహం

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన బాజిరెడ్డి



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాజిరెడ్డి, వీజీ గౌడ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలిపారు. సమకాలిన రాజకీయ అంశాలపై చర్చించి, జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను కేసీఆర్‌కు వివరించారు. ప్రజాసమస్యలను, ప్రభుత్వ లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ, కార్యకర్తల్లో మనోధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని నింపాలని ఈ సందర్భంగా కేసీఆర్ వారికి సూచించారు.

స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ సంఘటన మంత్రి రచ్చ శ్రీనివాస్

సుభాష్‌నగర్: ప్రజలు స్వదేశీ ఉత్పత్తులను ఆదరించి వినియోగించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో స్వదేశీ మేళా కరపత్రాలను ఎమ్మెల్యే మంగళవారం ఆవిష్కరించారు. ఈనెల 23 నుంచి 27వ తేదీవరకు స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో స్వదేశీ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వికసిత భారత్ లక్ష్యంగా ఐదు రోజులపాటు కొనసాగే మేళాలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే విధంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత పెట్టుబడిదారులకు సదావకాశమని, రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర సంఘటన మంత్రి రచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వదేశీ జాగరణ మంచ్ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగ నిపుణులకు వేదికని పేర్కొన్నారు. వ్యవసాయం, చేనేత, వస్త్ర, హస్తకళల ఉత్పత్తులు, సూక్ష్మ, చిన్నతరహా పారిశ్రామిక రంగ ప్రోత్సాహకాలు, ఆయుర్వేదిక్, హోమియోపతి, ఫార్మా, మత్స్య, పాడి పరిశ్రమ, స్వయం ఉపాధిని ప్రోత్సహించే రంగాల స్టాళ్లు ఈ మేళాలో ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు. స్వదేశీ జాగరణ మంచ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ కేశవ్ సోని, ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేశ్, స్వదేశీ జాగరణ మంచ్ కామారెడ్డి జిల్లా కన్వీనర్ డాక్టర్ రాహుల్, ప్రతినిధులు రోషణ్, నవీన్, మనీశ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమిని కబ్జా చేస్తున్నారు



అటవీశాఖ అధికారితో మాట్లాడుతున్న ఖైసర్

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ నగర శివారులోని అటవీ భూమి కబ్జాకు గురవుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సయ్యద్ ఖైసర్ మంగళవారం జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు ప్రతిని అందజేసి డీఎఫ్‌వో వికాస్‌మీనాకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. 12వ డివిజన్‌కు సమీపంలో మౌజం కాలనీ, పెయింటర్ కాలనీ, బాబన్ సహాబ్ పహాడ్ కాలనీల వద్ద ఉన్న ఫారెస్టు భూమిని ఓ కార్పొరేటర్ కబ్జా చేసి ప్రజలను మోసం చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నాడని తెలిపారు. అటవీ భూమిని చదును చేసి అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు ఇళ్లు నిర్మిస్తున్నారని, విచారణ చేపట్టి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని అటవీ అధికారులను సయ్యద్ కోరారు.

'ప్రజలు బీజేపీని కోరుకున్నారు'

సుభాష్‌నగర్: హర్యానా రాష్ట్రంలో బీజేపీపై వ్యతిరేకత ఉందని అసత్య ప్రచారం చేశారని, రైతులు, జాట్లు, మైనార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసిన కాంగ్రెస్ తోపాటు ఇతర పార్టీల కుట్రలను ప్రజలు తిరస్కరించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమానికి ప్రజలు మద్దతు పలికారన్నారు. మోదీ, జేపీ నడ్డా, అమిత్ షా హర్యానా ఎన్నికల్లో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. హర్యానా, జమ్ముకశ్మీర్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఖాతా కూడా తెరవలేదని, ఢిల్లీ ఎన్నికల్లో కూడా ఇవే ఫలితాలు పునరావృతమై బీజేపీ జెండా ఎగురవేస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

క్రైం కార్నర్

న్యూసెన్స్ చేసిన వ్యక్తికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: మద్యం సేవించి డయల్ 100కు కాల్ చేసిన వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన కర్‌పట్ల రాజేశ్ మద్యం సేవించి ఓ కేసు విషయమై ఈ నెల 7వ తేదీన డయల్ 100కు కాల్ చేసి న్యూసెన్స్ చేశాడు. అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపర్చగా, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజేశ్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ వద్ద ఉన్న మహాలక్ష్మి రైస్‌మిల్లు వద్ద పోలీసులు మంగళవారం సుమారు 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. దీనిపై ఎస్సై రాజశేఖర్‌ను వివరణ కోరగా.. దాస్‌నగర్ శివారులోని ఓ రైస్‌మిల్లు వద్ద డీసీఎంస్ వ్యాన్‌లో లోడ్ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న విషయం వాస్తవమేనన్నారు. బియ్యాన్ని ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనే వివరాలు తెలియరాలేదన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు వేర్వేరు కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు, అప్పులు తీర్చే మార్గంలేక ముగ్గురు.. ఇల్లరికం వెళ్లిన మరో వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డారు.

ఆర్థిక ఇబ్బందులతో..



కిష్టయ్య(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తి చెంది మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన నాయికోటి కిష్టయ్య(55)అనే వ్యక్తి మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కిష్టయ్య ఆరునెలల క్రితం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద పౌల్ట్రీ ఫామ్‌ను లీజుకు తీసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులపై తరచూ బాధపడుతున్న కిష్టయ్య.. సోమవారంరాత్రి పౌల్ట్రీ ఫామ్ వద్ద నిద్రించేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం పలుచోట్ల వెతికారు. గ్రామశివారులోని ఎయిర్‌టెల్ టవర వద్ద ఉన్న చెట్టుకు కిష్టయ్య టవల్‌తో ఉరేసుకొని కనిపించాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య నాయికోటి సులోచన పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

స్వగ్రామానికి వచ్చి..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన కుర్మ రాజు (35) అనే యువకుడు మండల కేంద్రం శివారులో మంగళవారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సాగర్ తెలిపారు. రాజయ్య ఒన్నాజిపేట్‌కు ఇల్లరికం వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇల్లరికం వెళ్లిన రాజు సదాశివనగర్‌కు వచ్చి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, కారణాలు తెలియరాలేదన్నారు.

అప్పు తీర్చే మార్గం లేక..



రాజలింగం (ఫైల్)

నందిపేట్(ఆర్మూర్): అప్పుల బాధ తాళలేక మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన గాదారి సత్తి రాజలింగం (54) ఈనెల 4వ తేదీన పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజలింగం ఇటీవలే వెల్మల్‌లో ఇంటిని నిర్మించాడు. ఇంటి నిర్మాణానికి అప్పులు కావడంతో ఎలా తీర్చాలని మదనపడుతుండేవాడు. ఈ నెల 4వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంతో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని నిజామాబాద్ లోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుని కుమారుడు గాదారి సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

వ్యవసాయంలో నష్టం రావడంతో..

బోధన్‌రూరల్: మండలంలోని కొప్పర్గ గ్రామానికి చెందిన మేకల నాగేశ్ (40) వ్యవసాయంలో నష్టాలు రావడంతో మద్యానికి బానిసై, అప్పుల బాధతో తనపొలంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వ్యవసాయంలో నష్టాలు రావడంతో నాగేశ్ గత కొంత కాలంగా మద్యాని బానిసై ఏ పనీ చేయకుండా అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక గతంలో రెండుమూడుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ నెల 7న ఇంట్లో భార్య లేని సమయంలో పొలానికి వెళ్తున్నానని తన కొడుకుకి చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు మంగళవారం పొలానికి వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జయశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేతిలోని డబ్బు లాక్కెళ్లిన దుండగులు

- బ్యాంకు నుంచి వెళ్తున్న వ్యక్తి నుంచి రూ.84,300 నగదు లూటీ
- నాగిరెడ్డిపేట మండలంలో ఘటన

బ్యాంకుల్లో నుంచి విత్ డ్రా చేసిన డబ్బును దుండగులు ఎత్తుకెళ్లిన ఘటనలు మంగళవారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట, బాన్సువాడ పట్టణంలో చోటు చేసుకున్నాయి. నాగిరెడ్డిపేట మండలం అక్కంపల్లిలో చేతిలోని డబ్బుల కవర్‌ను దుండగులు ఎత్తుకెళ్లగా, బాన్సువాడలో బైక్ కవర్‌లోని రూ.లక్ష మాయం చేశారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బ్యాంకులో నుంచి డబ్బు లు డ్రా చేసి తీసుకెళ్తున్న వ్యక్తి చేతిలోని కవర్‌ను బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు లాక్కెళ్లారు. క్షణాల్లో రూ.84,300 నగదు లూటీ చేశారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం అక్కంపల్లిలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. అక్కంపల్లికి చెందిన జక్కుల రాములు మంగళవారం మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంకులో నుంచి రూ.85వేలు డ్రా చేశాడు. అందులో రూ.50 నోట్ల కట్టలో నుంచి 14నోట్లు బాగాలేవనే కారణంతో వాటిని మార్చుకొని రూ.700జేబులో పెట్టుకున్నాడు. మిగిలిన రూ.83,300 ప్లాస్టిక్ కవర్‌లో పెట్టుకొని గోపాల్‌పేట నుంచి ఆటోలో ఇంటికి బయల్దేరాడు. రాములు అక్కంపల్లిలో ఆటో దిగి డబ్బులు ఉన్న కవర్‌ను చేతితో పట్టుకొని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అతని చేతిలోని డబ్బుల కవర్‌ను లాక్కెళ్లారు. రాములు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు దుండగులను వెంబడించినప్పటికీ వారు బైక్‌పై పరారయ్యారు. ఈ ఘటనపై నాగిరెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

బైక్ ట్యాంక్ కవర్‌లోని రూ.లక్ష మాయం..

బాన్సువాడ : బైక్ ట్యాంకు కవర్‌లో పెట్టిన రూ.లక్ష నగదు చోరీ అయిన ఘటన మంగళవారం బాన్సువాడ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని సంగమేశ్వర కాలనీకి చెందిన సమీరొద్దీన్ కెనరా బ్యాంకులో రూ.లక్ష నగదు డ్రా చేసి బైక్ పెట్రోల్ ట్యాంకు కవర్‌లో పెట్టారు. సమీరొద్దీన్ సంగమేశ్వర చౌరస్తాలో ఉన్న పాల కేంద్రం వద్ద బైక్‌ను ఆపి పాలను కొనేందుకు వెళ్లగా గమనించిన దుండగుడు నగదును ఎత్తుకెళ్లాడు. సమీరొద్దీన్ తిరిగివచ్చేసరికి బైక్ కవర్‌లోని రూ.లక్ష కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మోడెగాం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పద్మాజివాడి చౌరస్తాకు చెందిన బెస్త నవీన్(18) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. నవీన్ తన మిత్రుడు నిజాంతో కలిసి ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై మోడెగాం వెళ్తుండగా గాంధారి వైపు నుంచి పద్మాజివాడి చౌరస్తా వైపునకు అతివేగంతో వస్తున్న కారు ఢీకొట్టి సుమారు 20 మీటర్ల దూరం లాక్కెళ్లింది. నవీన్ ఘటనాస్థలంలోనే మృతి చెందగా, తీవ్ర గాయాలపాలైన నిజాంను హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు.

దాబా హోటల్‌లో..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణానికి చెందిన దూపల్లి బాలయ్య(40) అనే వ్యక్తి సోమవారం రాత్రి పట్టణ శివారులోని దాబాలో మృతి చెందాడని పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలయ్య తన మిత్రులు గూండ్ల సాయికుమార్, ద్యాకం శ్రీకాంత్‌తో కలిసి మద్యం సేవించాడని, భోజనం చేసేందుకు నర్సి రోడ్డులోని దాబాకు వెళ్లి స్పృహ తప్పి పోయాడన్నారు. బాలయ్యను అతడి స్నేహితులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారని సీఐ పేర్కొన్నారు. మృతుడి అన్న దూపల్లి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో పడి ఒకరి..



శ్రీనివాస్ (ఫైల్)

వర్ని: చందూర్ మండల కేంద్రంలోని ఊర చెరువులో పడి చాకలి శ్రీనివాస్ (40) అనే వ్యక్తి మృతి చెందినట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. సోమవారం రాత్రి బతుకమ్మను నిమజ్జనం చేసేందుకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదని, మంగళవారం ఉదయం ఊర చెరువులో శవమై కనిపించాడన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.